ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 21 నవంబరు 2024



సరుబుజ్జిలి: ఏబీ రోడ్డు పక్కన విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

అంతా మాయ



నరసన్నపేట: రోడ్డుపై ఆరబెట్టిన సన్న ధాన్యం

'అమ్మబోతే నష్టం.. కొనబోతే కష్టం' అన్న చందంగా ఉంది రైతులు, వినియోగదారుల పరిస్థితి. మార్కెట్‌లో మిల్లర్ల మాయాజాలంతో సన్న రకాల ధాన్యం మద్దతు ధర బస్తాకు రూ.500 వరకూ తగ్గింది. అదే సమయంలో బియ్యం ధర మాత్రం రూ.300 వరకూ పెరిగింది. దీంతో గిట్టుబాటు ధర లేదని అన్నదాతలు, బియ్యం ధరలు భగ్గుమంటున్నాయని వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- గిట్టుబాటు ధర లేని ధాన్యం
- భగ్గుమంటున్న బియ్యం
- విలవిల్లాడుతన్న వినియోగదారులు..
- ఆందోళనలో అన్నదాతలు
- మిల్లర్లు, వ్యాపారుల సిండికేట్‌తో ఇబ్బందులు

నరసన్నపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మిల్లర్లు, వ్యాపారుల మాయాజాలంతో రైతులకు, వినియోగదారులకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు రైతులు పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధర దక్కడం లేదు. మరోవైపు వినియోగదారులకు మార్కెట్‌లో బియ్యం ధర ఏ మాత్రం తగ్గడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాభావ పరిస్థితులు, తర్వాత తెగుళ్ల బెడద వెంటాడినా.. ధాన్యం దిగుబడులు మాత్రం బాగానే వచ్చాయి. మంచి ధర వస్తుందని రైతులు ఆశించగా.. మార్కెట్‌లో వ్యాపారుల తీరు కారణంగా నిరాశే ఎదురవుతోంది. ఏటా ఈ సీజన్‌లో పాతధాన్యం సన్నాలకు మంచి ధర ఉంటుంది. ఈ ఏడాది మాత్రం సన్నాలు ధర తగ్గించారు. గత నెలలో పాతధాన్యం బస్తా(81 కేజీలు) రూ.2,700 ఉండగా.. ప్రస్తుతం రూ.2,200కు కొనుగోలు చేస్తున్నారు. అదే సమయంలో బియ్యం ధర మాత్రం కిలోకి రూ.10చొప్పున పెంచుతూ భగ్గుమనిపిస్తున్నారు. నెల వ్యవధిలో బియ్యం ధర క్వింటాకు రూ.300 వరకు పెంచేశారు.

● ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సుమారు 1.23 లక్షల ఎకరాల్లో సన్నాలు ధాన్యం సాగు చేశారు. ఎకరాకు 35 బస్తాల వరకూ దిగుబడి రాగా.. ఎంతో సంతోషించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా.. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో గతేడాది మాదిరి బస్తా గరిష్ఠంగా రూ.2,700 వరకూ విక్రయించవచ్చని భావించారు. కానీ ఈఏడాది మిల్లర్లు సిండికేట్‌గా వ్యవహరించి రైతుల నుంచి సాంబ రకం(బీపీటీ 5304) బస్తా రూ.1,850కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఇతర రకాలు రూ.1,750 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో సన్నరకాలు సాగు చేసే ధాన్యం రైతులు దిగులు చెందుతున్నారు.

మిల్లర్ల కుచ్చుటోపీ

80 కేజీలు ధాన్యం మరపెడితే కనీసం 50 కేజీల నుంచి 60 కేజీల వరకు బియ్యం దిగుబడి వస్తాయి. 80 కేజీల ధాన్యం మరపెట్టేందుకు మిల్లరుకు అయ్యే ఖర్చు కేవలం రూ.80మాత్రమే. బస్తా ధాన్యం నుంచి వచ్చే ఊక, తవుడు, నూకలు.. విద్యుత్, హమాలీ ఖర్చులకు సరిపోతాయి. ఇక రవాణా చార్జీలు అంటే రైతుల మీద వేస్తారు. ధాన్యం బస్తాలను మిల్లుకు తెచ్చిన సమయంలో అన్‌లోడింగ్ కూడా రైతులే భరించుకోవాలి. ఈ లెక్క ప్రకారం 80 కేజీల ధాన్యం పెట్టుబడి రూ.1,850, ఇతర ఖర్చులు రూ.100 బస్తాకు వేసుకున్నా మొత్తంరూ.1,950 గిట్టుబాటు అవుతుంది. ధాన్యం మరపెట్టగా బస్తాకు సరాసరి 55కేజీల దిగుబడి వస్తుంది. అంటే బియ్యం విక్రయాల ద్వారా బస్తా ధాన్యానికి రూ.3,200 ఆదాయం వస్తుంది. మిల్లర్లు 70శాతం మేరకు లాభాలు వేసుకుని.. బియ్యం ధరలు పెంచేసి విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. మరోవైపు ధాన్యం ధర మాత్రం దయనీయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంట దాచుకోవడానికి సరైన వసతులు లేవని వాపోతున్నారు. మార్కెట్ కమిటీ ఉన్నా ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయని ఆరోపిస్తున్నారు.

భగ్గుమంటున్న బియ్యం ధరలు

మార్కెట్‌లో ధాన్యం ధర తగ్గడంతో బియ్యం ధరలు కూడా తగ్గుతాయని వినియోగదారులు ఆశించారు. కానీ క్వింటా బియ్యం ధర రూ.వందకు పెంచారు. గత నెలరోజులుగా సాంబమసూరి(సీసీలు), కర్నూలు సన్నాలు, స్వర్ణమసూరి, జగత్యాల రకాల బియ్యం ధరలు పెరుగుతున్నాయి. సాంబ మసూరు క్వింటా రూ.5,400 నుంచి రూ.5,600కు విక్రయిస్తున్నారు. అంటే బస్తా(26కేజీలు)రూ.1400 వరకు లోకల్ మిల్లువి అమ్మకాలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కంపెనీ బియ్యం రూ.1,600 నుంచి రూ.1,650 వరకూ విక్రయిస్తున్నారు. క్వాలిటీ పేరుతో పలు రకాల బియ్యాన్ని అధిక ధరకు అమ్ముతున్నారు. వ్యాపారులు, మిల్లర్లు కుమ్మక్కై మార్కెట్‌లో బియ్యం ధరలు పెంచేశారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.



బియ్యం ప్యాకెట్ రూ.1400



సన్నరకాల ధాన్యం ధర తగ్గినా మిల్లర్లు బియ్యం ధర తగ్గించడం లేదు. 26కేజీల బియ్యంబస్తా రూ.1400కు విక్రయిస్తున్నారు. ధాన్యం ధర తక్కువ ఉన్నప్పుడు బియ్యం 26కేజీల ప్యాకెట్లు రూ.1100కు విక్రయించేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మాలాంటి మధ్యతరగతి కుటుంబాలకు బియ్యం ధర పెరుగుదల ఇబ్బందిగా ఉంది.

- జె.రమణయ్య, ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు, నరసన్నపేట

సన్నాలు ధర తగ్గించి కొనుగోలు



గతేడాది సన్నాలు ధర బాగా ఉండటంతో ఈ ఏడాది సాగు చేశాం. పంట చేతికి వచ్చిన సమయంలో బస్తా రూ.1,850కే కొనుగోలు చేస్తున్నారు. నిల్వ చేసేందుకు గతం మాదిరి సదుపాయాలు లేక ఎప్పుడు పంట అప్పుడు మిల్లర్లకు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం గ్రేడ్ -1 ధాన్యం నిల్వచేసేందుకు సదుపాయలు కల్పిస్తే బాగుంటుంది.

- వాగ గోవిందరావు, ల్యాండ్ లార్డ్, జమ్ము

దళారుల దగా

- ధాన్యం బస్తాకు రూ.400 తగ్గింపు
- నేటికీ తెరవని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

సరుబుజ్జిలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. అన్నదాతలు దళారుల దగాకు గురికావాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ నెల 17 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఆదేశించింది. కానీ జిల్లాలో ఇప్పటివరకూ ఒక్క కేంద్రంలో కూడా కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో దళారులను ఆశ్రయించగా.. ఇదే అదునుగా వారు దోపిడీకి పాల్పడుతున్నారు.

సరుబుజ్జిలి మండలంలో సుమారు 5,100 హెక్టార్లలో రైతులు వరిసాగు చేశారు. సంపత్, అమూల్య, స్వర్ణ, 1001, 1061, 1064 అనే ధాన్యం రకాలను పండించారు. వీటికి ప్రభుత్వం 82 కేజీల బస్తాకు రూ.1,840 మద్దతు ధర ప్రకటించింది. దీంతో రైతులు ఎంతో సంబరపడ్డారు. ఇటీవల అల్పపీడనం ప్రకటనతో కోతలు పూర్తిచేసి.. ధాన్యం విక్రయాలకు సిద్ధమయ్యారు. ఈ మండలంలో డీసీఎంస్, కొత్తకోట సహకార సంఘం, ఐకేపీ, జీఈసీఎస్, సీసీఎస్ స్పోర్ట్స్‌తో పాటు ఇసకలపాలెనికి చెందిన అయ్యప్ప రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మొత్తం ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ఇంతరవకూ ఒక్క కేంద్రంలో కూడా కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదు. దీంతో రైతులు ధాన్యం భద్రపరిచే అవకాశం లేక దళారులకు విక్రయిస్తున్నారు. తేమశాతం ఎక్కువగా ఉందంటూ.. దళారులు 82కేజీల బస్తాకు రూ.1,430 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో రైతుల వద్ద క్వింటాకు రూ.400 వరకూ దోచుకుంటున్నారు. వాతావరణ పరిస్థితులకు భయపడి.. తప్పనిసరి పరిస్థితుల్లో విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల ప్రక్రియ ముమ్మరం చేయాలని కోరుతున్నారు.

● ఈ విషయమై మండల వ్యవసాయాధికారి పద్మనాభం వద్ద ప్రస్తావించగా.. త్వరలో కొనుగోలు చేపడతామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా.. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యాన శాఖకు ఊతం!

- రాయితీపై స్ప్రింక్లర్లు పంపిణీ
- రైతుల్లో హర్షం

మెళియాపుట్టి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలకు ఊతమిచ్చేలా.. మెట్ట ప్రాంతాల రైతులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఉపాధిహామీ నిధులను ఉద్యాన శాఖకు అనుసంధానం చేసి రైతులకు ఉపాధి కల్పించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనంతగా బడ్జెట్‌లో రూ.3,469.47కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించింది. ఇందులో అత్యధికంగా సూక్ష్మసేద్యానికి రూ. 2,700కోట్లు కేటాయించారు. తాజాగా రాయితీపై పైపుల పంపిణీ చేస్తున్నారు.

● జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నారు. అధికంగా గిరిజన ప్రాంతాల్లో సాగు నీరు అందక వరి సాగుకు ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాల్లో నీటిని స్ప్రింకర్లు పైపులతో అందిస్తే పంటలు కాపాడుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాయితీపై స్ప్రింకర్లు, పైపులు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రైతులు దరఖాస్తుతోపాటు సబ్సిడీ పోను వారి వాటా నగదు చెల్లిస్తే.. వెంటనే పైపులు అందజేయనుంది.

● 63 ఎంఎం పైపులు రూ.23,984 కాగా రైతులు రాయితీ 55 శాతం అంటే 13,063 రాయితీ ఇస్తారు. రైతులు వాటాగా రూ.10,921 చెల్లించాలి.

● 75 ఎంఎం పైపులు రూ.27,078 కాగా రూ.14,749 రాయితీ వర్తిస్తుంది. రైతు వాటా రూ.12,331 చెల్లించాలి.

● 90 ఎంఎం పైపులు రూ.32,180 కాగా రాయితీ 15,022. రైతు వాటా 17,158 చెల్లించాలి.

● 110 ఎంఎం పైపులు రూ.50,598 కాగా రూ.16,009 రాయితీ వర్తిస్తుంది. రైతు వాటా రూ.34,590 కడితే 30 పైపులు 5 స్ప్రింకర్లు అందజేస్తారు.

● ఇప్పటివరకూ 25మంది రైతులకు పైపులు అందజేశామని ఉద్యాన శాఖాధికారి దుక్క శరత్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని రైతు లు సద్వినియోగించుకోవాలని సూచించారు. పైపుల వల్ల నీరు వృథా కాకుండా కూరగాయలతో పాటు జీడి, మామిడి మొక్కలు పెంచుకోవచ్చని తెలిపారు.

మెళియాపుట్టి మండలం కుడ్డబ గ్రామానికి చెందిన పెద్దింటి లచ్చయ్య గత ఐదేళ్లుగా రాయితీపై స్ప్రింకర్లు పైపుల కోసం దరఖాస్తు చేసినా ఇవ్వలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. రాయితీపై పైపులు ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

మెళియాపుట్టి మండలం కేరాశింగి పంచాయతీ నేలబొంతు గ్రామానికి చెందిన సవర దాసుకు రెండు ఎకరాలు మెట్టుభూమి ఉంది. అందులో అంతర పంటలు కూరగాయలు పండించాలనే ఉద్దేశంతో ఉద్యానవన శాఖ రాయితీపై పంపిణీ చేసే పైపుల కోసం మూడేళ్ల నుంచి దరఖాస్తు చేస్తున్నాడు. ఇంతవరకు పైపులు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు పడ్డాడు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పైపులు ఇవ్వడంతో సంబరపడుతున్నాడు.



గిరిజన రైతులకు పైపులను అందజేస్తున్న దృశ్యం



భావనపాడు తీరం

తెరపైకి భావనపాడు హార్బర్

- నాలుగు దశాబ్దాలుగా నలుగుతున్న వైనం
- 1983లో అప్పటి గవర్నర్‌చే శంకుస్థాపన
- ఆ తర్వాత అవాంతరాలు.. పనులు నిలిపివేత
- కూటమి ప్రభుత్వం రాకతో మరోసారి కదలిక
- ఇటీవల రెండు కేంద్ర బృందాలు పర్యటన
- మంత్రిపై ఆశలు పెట్టుకున్న మత్స్యకారులు

టెక్కలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భావనపాడు సాగరతీరంలో హార్బర్ ప్రతిపాదన నాలుగు దశాబ్దాలుగా నలుగుతోంది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మత్స్యకారుల కల నెరవేర్చాలనే ఆలోచనకు శ్రీకారం చుట్టారు. టెక్కలి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన హార్బర్ సాధ్యాసాధ్యాలపై దృష్టి సారించి కేంద్ర బృందాలను ఆ ప్రాంత పరిశీలనకు ఆహ్వానించారు. అక్టోబరు 28, 29 తేదీల్లో భావనపాడు హార్బర్ కోసం బెంగళూరు నుంచి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీస్ (సీఐసీఈటీ) డిప్యూటీ డైరెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే నవంబరు 2న నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీచెర్స్ టీమ్ ప్రతినిధి సుధీర్‌కుమార్ బృందం భావనపాడు ప్రాంతంలో పర్యటించింది. రెండు బృందాలు ఈ ప్రాంతంలో ఇసుకదిబ్బలు, క్రిక్‌వాల్స్ పరిశీలించి స్థానిక మత్స్యకారులు, జిల్లా మత్స్యశాఖ అధికారులతో మాట్లాడాయి.

హార్బర్ వ్యవహారం ఇదీ..

1983లో మార్చి 26న అప్పటి గవర్నర్ కుముద్‌బెన్ జోషి భావనపాడు హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. మత్స్యకారులకు అవసరమైన వేలం చావిడి, పెట్రోల్‌బంకు, లైట్‌హౌస్, విశ్రాంతి గృహం, రూ.3.50కోట్లతో 90 మీటర్ల దక్షిణగోడ, లంగర్ ప్లాట్‌ఫారం నిర్మాణం చేసి 1985లో ప్రారంభానికి సిద్ధం చేశారు. అదే సమయంలో (మిగతా 6వ పేజీలో..)



నేడు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

గంగపుత్రుల మరణ మృదంగం

- ఏటా పెరుగుతున్న ప్రమాదాలు



రణస్థలం మండలం అల్లివలస గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ (34) అనే మత్స్యకారుడు ఈనెల 18న చేపలవేటకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. వేట ముగించుకుని వస్తుండగా బోటు బోల్తా పడింది. ఊపిరాడక అతను మృత్యువాత పడ్డాడు. వయసు 34 సంవత్సరాలు మాత్రమే. ఏడాది వయసున్న కుమారుడు, భార్య, వృద్ధులైన తల్లిదండ్రులు నిరాశ్రయులయ్యారు.



ఈ నెల 6న వజ్రపుకొత్తూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గుడుపల్లి జగదీష్(40) అనే మత్స్యకారుడు వేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. స్థానికంగా వేట గిట్టుబాటు కాక విశాఖ వెళ్లాడు. అక్కడ బోటులో వేటకు వెళ్లి సముద్రంలో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. తర్వాతి రోజు మృతదేహం ఒడ్డుకు చేరింది. అతని వయసు 40 సంవత్సరాలు. జగదీష్ అకాల మరణంతో భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులు వీధినపడ్డారు.

..ఇలా
జిల్లాలో ఏటా పదుల సంఖ్యలో మత్స్యకారులు ప్రాణాలు కోల్పోతున్నారు. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నా.. జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు కానీ, జెట్టీలు కానీ అందుబాటులో లేవు. దీంతో మత్స్యకారులు నాటు పడవలపై ప్రమాదకర స్థితిలో వేట సాగిస్తున్నారు. స్థానికంగా వేట గిట్టుబాటు గాక వేలాది మంది చెన్నై, గుజరాత్, ముంబై, కలకత్తా, పారాదీప్ వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వ పథకాలు, రాయితీలు కూడా సక్రమంగా అందక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా వారి జీవన పరిస్థితులు, ఇబ్బందులపై కథనం.

6 లో

అనుమానాస్పదంగా తిరిగి..
ఆర్డీఎక్స్ అమర్చి..

- అరసవల్లి, కళింగపట్నంలో డమ్మీ ఆర్డీఎక్స్‌ల స్వాధీనం
- సాగర్ కవచ్‌లో భాగంగా ఇద్దరు రెడ్‌ఫోర్స్ పట్టివేత

7 లో

మూడేళ్ల కాలపరిమితిని
రద్దు చేయాలి

- వీవోఏ సంఘం డిమాండ్


శబరిమలైకి వెళ్లేదెలా?

- ప్రత్యేక రైళ్లు ప్రకటించని ఈస్ట్‌కోస్ట్ రైల్వేశాఖ
- ఆందోళనలో అయ్యప్ప భక్తులు

6 లో

● ప్రతిఏటా పెరుగుతున్న ప్రమాదాలు ● మృత్యువాత పడుతున్న మత్స్యకారులు
● అందుబాటులోకి రాని హార్బర్లు, జెట్టీలు ● అమలుకాని ప్రభుత్వాల హామీలు
● నేడు ప్రపంచ మత్స్యకార దినం

గంగపుత్రుల.. మరణమృదంగం



రణస్థలం/ ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):

● సెప్టెంబరు 2న ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు పంచాయతీ పాత దిబ్బపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు జంగమయ్య మృత్యువాత పడ్డాడు. నాగావళి నదీ సంగమం వద్ద సముద్రంలో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. వయసు 53 ఏళ్లు. పెళ్లీడుకు వచ్చిన కుమార్తెలు, వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారు. దీంతో భార్య బాధ వర్ణనాతీతం.

● జూలై 8న సోంపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు పలిశెట్టి జోగారావు మృత్యువాత పడ్డాడు. చేపల వేటకు వెళ్లిన జోగారావు సంద్రం మధ్యలో ప్రమాదానికి గురయ్యాడు. కేవలం 48 సంవత్సరాలు. పిల్లలిద్దరూ చదువుకుంటున్నారు. కుమార్తెకు వివాహం చేయాల్సి ఉంది. దీంతో భార్య, వృద్ధ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

... ఇలా జిల్లాలో ఏదో ఒకచోట మత్స్యకారుల మరణ మృదంగం కొనసాగుతునే ఉంది. ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు విడుస్తున్నారు. వారి కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా మత్స్యకారుల తలరాతలు మారడం లేదు. వారికి లబ్ధి చేకూరే శాశ్వత ప్రాజెక్టులేవీ జిల్లాలో నిర్మాణం కావడం లేదు.

ఇదీ పరిస్థితి..

రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతం జిల్లా సొంతం. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో 193 కిలో మీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 104 మత్స్యకార గ్రామాలున్నాయి. లక్షకుపైగా జనాభా ఉన్నారు. మొత్తం 6,211 మత్స్యకారులు వేటకు వెళ్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయితే జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు కానీ, జెట్టీలు కానీ అందుబాటులో లేక మత్స్యకారులు సంప్రదాయ వేటకే పరిమితమయ్యారు. ఇప్పటికీ నాటు పడవలపై ప్రమాదకర స్థితిలో వేట సాగిస్తున్నారు. స్థానికంగా వేట గిట్టుబాటు గాక వేలాది మంది చెన్నై, గుజరాత్, ముంబై, కలకత్తా, పారాదీప్ వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కాంట్రాక్టర్ల వద్ద పనికి కుదురుతున్నారు. కొన్నిసార్లు విదేశీ జలాల్లోకి ప్రవేశించి అక్కడి కోస్టుగార్డులకు చిక్కుతున్నారు. ఖైదీలుగా మారుతున్నారు. ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. అలాంటి విషాద సమయాల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలుయ గుప్పిస్తున్నారు. ఆతరువాత వాటి గురించే మరిచిపోతున్నారు.

ఇవి చేయాలి..

- వేటకు వెళ్లే మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు ఇవ్వాలి
- రాయితీపై స్టీమర్లు (మరబోట్లు) అందించాలి.
- జాప్యం చేయకుండా జిల్లాలో ప్రతిపాదించిన ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలను వీలైనంత త్వరగా నిర్మించాలి.
- తీరంలో పడవలు, వేట సామగ్రి సంరక్షణ చర్యలు చేపట్టాలి.
- ప్రతీ తీర ప్రాంతానికి రహదారుల నిర్మాణం చేపట్టాలి.
- చేపలు ఆరబెట్టేందుకు ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయాలి.
- చేపలను నిల్వ చేసుకునేందుకు వీలుగా కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుచేయాలి.
- వేట నిషేధ సమయానికి చెల్లించాల్సిన భృతిని సకాలంలో అందివ్వాలి.
- వేట లేని సమయంలో మత్స్యకార గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలుచేయాలి.

పనుల్లో పురోగతి ఏదీ?


టీడీపీ ప్రభుత్వ హయాంలో భావనపాడు హార్బర్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయింది. ఇంతలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో హార్బర్ నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. అయితే ఈ ఎన్నికలకు ముందు భావనపాడు హార్బర్‌ను మూలపేటకు మార్చారు. అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. కానీ అదో ఎన్నికల స్టంట్‌గా మిగిలిపోయింది. అప్పట్లో వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్ల పేటలో జెట్టీ నిర్మాణంతో పాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వైసీపీ ప్రజాప్రతినిధులు హడావుడిగా శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ప్రారంభించలేదు. తాజాగా కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వీటిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది.

వాటికి దూరంగా..

జిల్లా మత్స్యకారులు అత్యాధునిక బోట్లు, స్టీమర్లకు దూరంగా ఉన్నారు. లైఫ్ జాకెట్లు వంటివి లేకపోవడంతో ప్రమాదకర వేట సాగిస్తున్నారు. విశాఖ, కాకినాడ, పారాదీప్‌నకు చెందిన మత్స్యకారులు స్టీమర్లు, ఇతర ఆధునిక పరికరాలతో వేట సాగిస్తున్నారు. ఇక్కడి మత్స్యకారులకు చేపలు చిక్కడం లేదు. దీంతో ఎనిమిది నాటికల్ మైళ్ల దూరం వెళ్లి వేట సాగించాల్సి వస్తోంది. సంప్రదాయ పడవల్లోనే అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వేటకు వెళుతున్నారు. రాకాసి అలలతో పాటు విపత్తులకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. జూలై నుంచి నవంబరు వరకూ సముద్రంలో ఎక్కువగా గాలులు వీస్తాయి. ఆ సమయంలోనే మత్స్యకారులు ఎక్కువగా ప్రమాదాల బారినపడుతుంటారు. ఇంజను పడవపై ఆరుగురు వెళ్లాల్సి ఉండగా.. 18 మంది వేటకు వెళుతున్నారు. ఇక కర్ర పడవపై ముగ్గురు వెళ్లాల్సి ఉండగా.. ఆరుగురు వెళుతున్నారు. ఈ క్రమంలో పడవలు ఒడిదుడుకులకు లోనై బోల్తా పడుతున్నాయి.

కంటితుడుపు చర్యలే

ప్రభుత్వ రాయితీలు, పథకాల విషయంలో మత్స్యకారులు కంటితుడుపు చర్యలకే పరిమితమవుతున్నారు. వేట నిషేధ సమయంలో అందించే మత్స్యకార భరోసా ఇప్పటికీ చాలామంది అర్హులకు అందలేదు. సోంపేట, వజ్రపుకొత్తూరు మండలాల్లో పథకం పక్కదారి పట్టినట్లు విమర్శలు ఉన్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో చాలామంది అనర్హులు దక్కించుకున్నారు. నాయకులు బినామీల పేరుతో లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడినట్లు విమర్శలు ఉన్నాయి. దీనిపై ఫిర్యాదులు వచ్చినా దర్యాప్తులు లేవు. వేటలో భాగంగా మత్స్యకారులు చిన్న వయసులోనే కంటి సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. ఇటువంటి వారిని గుర్తించి పింఛన్లు అందిస్తామన్న ప్రభుత్వ హామీ బుట్టదాఖలైంది. సరిగ్గా వేట సాగక ఏటా వేలాది మంది మత్స్యకారులు కుటుంబాలను గ్రామాల్లో విడిచిపెట్టి సుదూర ప్రాంతాలు వలసపోతున్నారు. స్థానికంగా ప్రత్యామ్నాయ ఉపాధి లేక కొంతమంది రహదారుల పక్కన కళ్లద్దాలు, బొమ్మలు విక్రయిస్తున్నారు. జిల్లాలో హైవేతో పాటు ప్రధాన రహదారుల వెంబడి కనిపించే దుకాణాలు ఎక్కువగా మత్స్యకారులవే. కనీసం మత్స్యకార గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కూడా జరగని దుస్థితి. కనీసం పక్క గ్రామాలు, మైదాన ప్రాంతాల్లోనైనా ఉపాధి పనులు కల్పించాలని మత్స్యకారులు ఎప్పటి నుంచో కోరుతున్నా ఫలితం లేదు.



గుజరాత్‌లో చేపలు వేటాడుతున్న సిక్కోలు మత్స్యకారులు (ఫైల్)

బుడగట్లపాలెం హార్బర్ నిర్మాణమైతే..

ఈ ఏడాది కూడా మత్స్యకారులు గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలకు వలసపోయారు. గుజరాత్‌లో వీరావల్, కాండ్లా, పోరుబందర్‌తో పాటు కర్ణాటకలోని మంగుళూరుకు వెళ్లారు. ఏటా ఆగస్టులో వెళ్లి తిరిగి ఏప్రిల్ నెలలోనే స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. జిల్లాలో సుదూర సముద్ర తీరమున్నా గుజరాత్ రాష్ట్రానికి వలసపోవడానికి కారణం మత్స్యకారుల ఆర్థిక పరిస్థితులే. ఈ ప్రాంతంలో మత్స్యకారులు సంప్రదాయ తెప్పలతో, మోటారు బోట్లతో వేట సాగిస్తున్నారు. ఐదారుగురు జాలర్లు చేపల వేటకు వెళితే కనీస ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉంది. ఇల్లు కట్టాలన్నా, ఆడపిల్లల పెళ్ళిళ్ల చేయాలన్నా వీరికి పెద్ద సమస్యగా ఉంది. గుజరాత్‌లోని బోటు యజమానితో ముందుగా ఒప్పందం కుదుర్చుకుని వలసవెళ్తారు. ఒక్కో బోటులో 7 నుంచి 9 మంది వరకు వెళ్తుంటారు. చేపల వేట ఆశించిన స్థాయిలో సాగితేనే ఒప్పందం మేరకే డబ్బులు చెల్లిస్తారు. గుజరాత్‌కు వెళ్లిన మత్స్యకారులు పడరాని కష్టాలు పడుతున్నారు. గుజరాత్‌లో వీరావల్‌లోని అరేబియా సముద్రంలో చేపల వేట సాగిస్తూ పొరపాటున సరిహద్దు దాటితే పాక్ కోస్టుగార్డులకు చిక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 2018 సంవత్సరం నవంబరు నెలలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 22 మంది మత్స్యకారులు పాక్‌కు బందీలుగా చిక్కి ఏడాదిన్నర తర్వాత విముక్తులయ్యారు. అంతకు మునుపు కూడా ఇలాంటి సంఘటనలు ఉన్నాయి. అప్పటి నుంచి ఈ ప్రాంతానికి మత్స్యకారులు కొంతమంది కర్ణాటక రాష్ట్రానికి వలసలు ప్రారంభించారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణమైతే మత్స్యకారులకు వలస నివారణకు అవకాశం ఉంటుంది. అన్ని అనుమతులు ఉన్నా ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మత్స్యకారుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. వేట నిషేధ సమయంలో అర్హులందరికీ మత్స్యకార భరోసా అందించింది. జిల్లాలో భావనపాడు, బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం చేపడుతున్నాం. మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మితం కానుంది. ఇందుకు సంబంధించి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

- శ్రీనివాసరావు, మత్స్యశాఖ డీడీ శ్రీకాకుళం

వేటకు వెళ్తేనే పూట గడిచేది



వేటకు వెళ్తేనే కుటుంబానికి పూట గడిచేది. లేకుంటే పస్తులే మిగులుతాయి. తుఫాన్లు, వాతావరణం సరిగ్గా లేనప్పుడు రోజుల తరబడి ఇంటి వద్దే ఉండిపోతాం. కనీసం ఉపాధి హామీ పనులు ఉంటే కొంత ఇబ్బందులు తీరుతాయి. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పూర్తి స్థాయిలో ఉపాధి పనులు మాత్రం కల్పించలేదు.

- మైలపల్లి కామరాజు, మత్స్యకారుడు, జీరుపాలెం

చాలా ఇబ్బందులు పడుతున్నాం



స్థానికంగా వేట గిట్టుబాటు కలగడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. తప్పనిసరైతే సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. ఉన్న గ్రామాల్లో కుటుంబాలను విడిచిపెట్టి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం జిల్లాలో హార్బర్లు, జెట్టీల నిర్మాణం పూర్తిచేయాలి.

- అప్పారావు, మత్స్యకారుడు, కొవ్వాడ

లైఫ్ జాకెట్లు ఇవ్వాలి



మత్స్యకారులు లైఫ్ జాకెట్లు లేక ప్రాణాలు కోల్పోతున్నారు. వీటిని కొనుగోలు చేసే స్థోమత మత్స్యకారులకు లేదు. అటు సంప్రదాయ పడవల్లోనే సముద్రంలో ఎనిమిది నాటికల్ మైళ్ల దాటి వేట సాగించాల్సి వస్తోంది. అర్ధరాత్రి బయలుదేరితే కానీ సముద్రంలోకి వెళ్లలేం. ఆ సమయంలోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆధునిక వేట పద్ధతులను ప్రోత్సహించాలి.

- దుమ్ము అశోక్, మత్స్యకారుడు, జీరుపాలెం



లేలేత కిరణాల నడుమ..

అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడి లేలేత కిరణాలు సముద్ర అలలపై పడి ప్రతిబింబిస్తుండగా.. అదే సమయంలో ఓ పక్షి సూర్యుడిని తాకుతూ వెళ్తున్నట్టు కనిపించిన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. ఇది అక్కుపల్లి వద్ద శివసాగర్‌బీచ్‌లో బుధవారం ఉదయం కనిపించింది. సముద్రుడు కూడా ఆ సమయంలో ప్రశాంతంగా ఉండి సూర్యుడి లేలేతకిరణాలు ఆస్వాదిస్తున్నట్టు కనిపించాడు.

- వజ్రపుకొత్తూరు (ఆంధ్రజ్యోతి)

తెరపైకి భావనపాడు హార్బర్

(ఐదో పేజీ తరువాయి)

దక్షిణ ముఖద్వారం వద్ద ఇసుక మేట వేసింది. ఈ మేటల్ని తొలగించేందుకు అప్పటి మత్స్యశాఖ కమిషనర్ రస్తోగి నిపుణుల బృందంతో కలిసి పరిశీలించారు. అప్పటికే నిర్మాణమైన 90మీటర్ల దక్షిణగోడను మరో 60 మీటర్లు పెంచాలని నిపుణుల బృందం సూచనల మేరకు కోటిన్నర రూపాయలు అదనంగా మంజూరు చేశారు. అయినా ఇసుకమేటలు తగ్గలేదు. దీంతో 1987లో పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధి బృందం భావనపాడు భౌగోళిక పరిస్థితులు పరిశీలించింది. తూర్పు తీరంలో సెప్టెంబరు నెల నుంచి జనవరి నెల వరకు వచ్చే గాలులు ప్రభావంతో కెరటాల ద్వారా ఇసుక కొట్టుకు వస్తుందని గుర్తించి అక్కడ సాధ్యపడదని అప్పట్లో తేల్చి చెప్పింది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1987 డిసెంబరు నెలలో విశాఖ నుంచి డ్రెడ్జర్ తెప్పించి ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరిపించింది. డ్రెడ్జర్‌తో తవ్వకాలకు ఖర్చు ఎక్కువ కావడంతో ఆ పనులు సైతం పక్కన పడేశారు. అప్పటికి హరిశ్చంద్రాపురం శాసనసభ్యులుగా ఉన్న కింజరాపు ఎర్రన్నాయుడు హార్బర్ కోసం పట్టువీడలేదు. ఎలాగైనా పనులు జరిగేటట్లు చూడాలని నిధులు సైతం మంజూరు చేయించారు. ఆ తరువాత ఆయన పార్లమెంట్ సభ్యుడిగా వెళ్లడం, హరిశ్చంద్రాపురం ఎమ్మెల్యేగా కింజరాపు అచ్చెన్నాయుడు గెలిచి.. అప్పటి ఎంపీ ఎర్రన్నాయుడు చొరవతో హార్బర్ పనులపై దృష్టి సారించారు. దీంతో మత్స్యశాఖ మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, జాయింట్ కలెక్టర్ సత్యన్నారాయణ, ఆర్డీవో నర్సింగరావు, ఇతర మత్స్యశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు భావనపాడు హార్బర్ సాధ్యాసాధ్యాల పరిశీలనకు పడవలో కొంతదూరం వెళ్లారు. దక్షిణ ముఖద్వారం చూసి తిరిగివస్తూ లంగర్ ప్రాంతానికి వచ్చేసరికి పడవ బోల్తాపడింది. స్థానిక మత్స్యకారులు వీరిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. 1999లో టెక్కలి ఎమ్మెల్యేగా గెలిచిన కొర్ల రేవతీపతి అసెంబ్లీలో భావనపాడు హార్బర్ సమస్య ప్రస్తావించినప్పటికీ దానిపై దృష్టిసారించే యంత్రాంగం కరువైంది. మొత్తం మీద 1999 నుంచి 2024 వరకు భావనపాడు హార్బర వ్యవహారం బాలారిష్టాలతో మూలకు చేరింది. అయితే ఈసారి టెక్కలి ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు హార్బర్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల పరిశీలనకు శ్రీకారం చుట్టడంతో మరోసారి తెరపైకి వచ్చింది. అప్పటి సాంకేతిక పరిజ్ఞానానికి, నేటి సాంకేతిక పరిజ్ఞానానికి బోలెడు సౌకర్యాలు పెరగడంతో ఈసారైనా హార్బర్ నిర్మాణం జరుగుతుందా? అని మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు.



ఇటీవల భావనపాడులో పర్యటించిన ఎన్‌సీసీఆర్ బృందం



శబరిమలైకి వెళ్లేదెలా?

● ప్రత్యేక రైళ్లు ప్రకటించని ఈస్ట్‌కోస్ట్ రైల్వేశాఖ ● ఆందోళనలో అయ్యప్ప భక్తులు

ఆమదాలవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో అధిక సంఖ్యలో భక్తులు అయ్యప్పస్వామి మాల ధరించారు. వీరంతా దీక్ష విరమణకు కేరళ రాష్ట్రం శబరిమలైలోని అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్తుంటారు. ఇప్పటికే శబరిమలైలో అయ్యప్ప గుడి తలుపులు తెరుచుకున్నాయి. డిసెంబరు నెలాఖరు వరకు జరిగే మండల దీక్ష విరమణ కోసం శ్రీకాకుళంతో పాటు విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రంలోని ఎంతో మంది అయ్యప్ప భక్తులు అధికంగా రైళ్లలో వెళ్లేందుకు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తారు. అయితే, కేరళకు వెళ్లే రైళ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ మూడు నాలుగు రైళ్లు మాత్రమే కేరళకు నడుస్తుంటాయి. మూడు నెలల ముందే ఈ రైళ్లలోని సీట్లకు రిజర్వేషన్లు పూర్తయ్యాయి. దీంతో శబరిమలైకు వెళ్లేదెలా? అని మాలధారులు ఆందోళన చెందుతున్నారు. ఇంతవరకు ఈస్ట్‌కోస్టు రైల్వేశాఖ అధికారులు ప్రత్యేక రైళ్లకు సంబంధించి ప్రకటన చేయలేదు. ఈనెలాఖరుతో పాటు డిసెంబరు నెల మొదటి రెండు వారాల్లో అధిక సంఖ్యలో భక్తులు శబరిమలై వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తుల కోసం 23 ప్రత్యేక రైళ్లు ప్రకటించాయి. కానీ, ఈస్ట్‌కోస్ట్ పరిధిలో ఉన్న విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా భక్తుల కోసం ఇప్పటివరకు ఎటువంటి రైల్వే ప్రకటన రాకపోవడంతో శబరిమలై ప్రయాణంపై సందిగ్ధం నెలకొంది. ప్రత్యేక రైళ్లు కేటాయిస్తుందా? లేదా అని ఆందోళన చెందుతున్నారు. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులతో పాటు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శబరిమలైకు ప్రత్యేక రైళ్ల ఏర్పాటుకు కృషి చేయాలని అయ్యప్ప భక్తులు కోరుతున్నారు.

ప్రత్యేక రైళ్లు నడపాలి..



జిల్లాలోని అయ్యప్ప భక్తులు శబరిమలైకు వెళ్లేందుకు సరైన రైల్వే సౌకర్యాలు లేవు. తక్షణమే ఈస్ట్‌కోస్ట్ రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడపడానికి చర్యలు చేపట్టాలి.

- గోవిందరావు, బీజేపీ మండల అధ్యక్షుడు, సరుబుజ్జిలి

ఇబ్బందులు తప్పేలా లేవు..



ఈ ఏడాది నాతో పాటు 20 మంది అయ్యప్పస్వామి మాల ధరించారు. దీక్ష విరమణ కోసం శబరిమలైకు వెళ్లే రైళ్లన్నీ ఫుల్ అయిపోయాయి. దీంతో మాకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఉన్న రైళ్లు నిండుకోవడంతో ఆమదాలవలస రైల్వే స్టేషన్ (శ్రీకాకుళంరోడ్) నుంచి తమిళనాడు వరకు ఒక రైలులో, తమిళనాడు నుంచి కేరళకు మరో రైలులో వెళ్లేందుకు టిక్కెట్లు తీసుకోవాల్సి వస్తుంది. కేరళకు ప్రత్యేక రైళ్లు నడిపితే ఉత్తరాంధ్ర స్వాములకు అనుకూలంగా ఉంటుంది.

- ఎండ రామారావు, సరుబుజ్జిలి

జల్‌జీవన్‌లో 'ఎన్టీఆర్ సుజలధార'కు నిధులివ్వండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే గౌతు శిరీష



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఉద్దానంలో పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధి సమస్యపై దృష్టి సారించాలని, ఇందులో ఎన్టీఆర్ సుజలధారకు నిధులు కేటాయించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆమె ఉద్దానం కిడ్నీ వ్యాధులపై మాట్లాడారు. ఉద్దానం కిడ్నీ సమస్యలను ప్రపంచానికి చూపించిందే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అని, ముందు చూపుతో సీఎం చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ సుజలధార అని పెట్టారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని నిర్వీర్యం చేశారని, వారి చర్యల మూలంగా 81 పథకాలు పనిచేయడం లేదని సమావేశంలో ప్రస్తావించారు. ప్రభుత్వం, పంచా యతీరాజ్ శాఖమంత్రి పవన్ కల్యాణ్ ఈ పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవా లని ఆమె కోరారు. కిడ్నీ వ్యాధులకు మందులు, డయాలసిస్ చేయడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిపై దృష్టి సారించాలని కోరారు.

రిఫ్రిజిరేటర్ల కొనుగోలుపై విచారణ చేయండి

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్ర భుత్వం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఐసోలేషన్ రిఫ్రిజిరేటర్ల కొనుగోలులో అక్రమాలకు పాల్పడడంపై విజిలెన్స్ విచారణ చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు.ఈ మేరకు బుధవారం శాసనసభలో మాట్లాడుతూ బ్రాండెడ్ గోద్రేజ్ కంపెనీని పక్కనపెట్టి పక్క రాష్ట్రాలు 1.30 లక్షలతో కొనుగోలు చేసిన ఐసోలేషన్ రిఫ్రిజిరేటర్లను ఇక్కడ రూ. 2.04 లక్షలకు కొనుగోలు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోగల 11 కేవీ ఎచ్చెర్ల మండల హెడ్‌క్వార్టర్స్ ఫీడర్‌లోని ఎచ్చెర్ల, అనమిత్ర టౌన్‌షిప్, ఎస్ఎంపురం పాఠశాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ పి.యోగీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

25న శ్రీకాకుళంలో కోటి దీపోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షుడు ముక్కల కొండబాబు ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం ఈనెల 25న నిర్వహించనున్నారు. ఈసందర్భంగా వీఐపీ, దీపారాధన గ్యాలరీ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా 108 మంది దంపతులతో అభిషేకాలు, దశవిధ హారతులు, అష్టోత్తర లింగార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అరసవల్లికి చెందిన రుత్వికులు హరిసూర్య ప్రసాద్ శర్మ తెలిపారు.

ఫిబ్రవరిలో ఏఐవైఎఫ్ మహాసభలు

సరుబుజ్జిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఫిబ్రవరి ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ కోరారు. బుధవారం సరుబుజ్జిలిలో విలేకరులతో మాట్లాడుతూ యువజన హక్కులు సాధన, ఉద్యోగ, ఉపాధి అవకాశాల సాధనకోసం సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లాప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఆమదాలవలస నియోజకవర్గం నాయకులు సింహాచలం, ధర్మారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మే నెలలో రెడ్డిక సంఘం వేడుకలు

ఇచ్ఛాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం-పూరి- గంజాం-గజపతి జిల్లాల రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘం ఏర్పడి వందేళ్లు పూర్తవుతుండడంతో వేడుకలు నిర్వహించాలని సంఘం పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం ఇచ్ఛాపురంలో రెడ్డిక కులస్థుల సమావేశం నిర్వహించారు. సంఘ పెద్దలు మాట్లాడుతూ మహాసభ విజయవంతం చేయడానికి అందరూ ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది మే నెలలో జరగనున్న ఈ వేడుకల్లో సంఘ చరిత్ర, ఐక్యత, కట్టుబాట్లు, ఉట్టిపడేలా స్థూపం ఏర్పాటుచేయాలని పెద్దలు తీర్మానించారు. కార్యక్రమంలోఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేటమండలాలు, ఒడిశాలోని పలు ప్రాంతాలకు చెందిన రెడ్డిక కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మహాలనోబిస్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు20(ఆంధ్రజ్యోతి):స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్ పీసీ మహాలనోబిస్ అంతర్జాతీయ అవార్డుకు ఏపీప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు 2025 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు తెలిపారు. ఈఅవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లు పేర్కొన్నారు. గణాంక సిద్ధాంతం అభ్యాసంలో ప్రావీణ్యం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.దీనికి సంబంధించి నామినేషన్‌ను డిశంబరు 31లోగా సమర్పించాలని కోరారు.

మెప్మా పీడీగా పలాస డీఎల్‌డీవో

శ్రీకాకుళం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : పలాస డీఎల్‌డీవో జీవీ చిట్టిరాజుకు డిప్యూటేషన్ ప్రాతిపదికన విజయనగరం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈమేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డవలప్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి కె.కన్నబాబు జీవో విడుదల చేశారు.



మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేయాలి

● వీవోఏ సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి

అరసవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దుచేయాలని ఏపీ వెలుగు వీవోఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్‌చేశారు. వీవోఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. తొలుత ఆర్అండబీ బంగ్లా రోడ్డు నుంచి ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. మహిళా మార్ట్‌ల్లో కొనుగోళ్లకు సంబంధించి వీవోఏలకు టార్గెట్లు ఇవ్వడం ఆపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూజిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి, వీఓఏలసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరినాయుడు, డి.జోగారావు, వై.అనూరాధ, వై.హేమలత, వై.ఎర్రయ్య, సురేష్, ఎం.శోభారాణి, జి.శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వెలుగు వీవోఏలు

అనుమానాస్పదంగా తిరిగి.. ఆర్డీఎక్స్ అమర్చి

● అరసవల్లి, కళింగపట్నంలో డమ్మీ ఆర్డీఎక్స్‌ల స్వాధీనం

● సాగర్ కవచ్‌లో భాగంగా రెడ్‌ఫోర్స్ బృందం పట్టివేత

శ్రీకాకుళం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అరసవల్లి, కళింగపట్నంలో నిర్వహించిన సాగర్ కవచ్‌లో భాగంగా రెడ్‌ఫోర్స్ విశాఖపట్నం నేవీ బృందాన్ని మెరైన్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు ఐదోతేదీన సాగర్ కవచ్ నిర్వహించిన విషయం విదితమే. తాజాగా రెండోసారి బుధ, గురువారాల్లో సాగర్ కవచ్‌ను మెరైన్ పోలీసులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు డమ్మీ ఆర్డీఎక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు.

● కళింగపట్నంలోని లైట్‌హౌస్‌లో బుధవారం ఉదయం 10:20 నిమిషాలకు రెడ్‌ఫోర్స్ బృందం డమ్మీ ఆర్డీఎక్స్ బాంబు పెట్టేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో మెరైన్ సీఐ ప్రసాదరావు ఎస్ఐలు వి.బాలకృష్ణ, కె.మహాలక్ష్మి, ఏఎస్ఐ వైకుంఠ రావు, హెచ్‌సీ శ్యామలరావు,బాపూజీ, బీవీ ప్రసాద్, రాంబాబు, దుర్గారావులు పట్టుకుని గార పోలీసుస్టేషన్‌కు తరలించారు. దర్యాప్తు నిర్వహించి రెడ్‌ఫోర్స్ బృందానికి చెందిన వారిగా గుర్తించారు.తర్వాత పోలీసులు వారిని విడిచిపెట్టగా మళ్లీ అరసవల్లి ఆలయంలో బాంబు పెటేందుకు ప్రయత్నించి పట్టుబడ్డారు.


కళింగపట్నం లైట్‌హౌస్ వద్ద పట్టుబడిన రెడ్‌ఫోర్స్ బృందం

●శ్రీకాకుళంలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో డమ్మీ ఆర్డీఎక్స్ బాంబ్ అమర్చేందుకు బుధవారం మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో సాధారణ భక్తుల మాదిరిగా ఆలయానికి ఇద్దరు వ్యక్తులు మెడలో తువ్వాలు ధరించి బ్యాగ్‌తో వచ్చారు.ఆలయం బయట అనుమానాస్పదంగా కనిపించడంతో సీఐ బర్ల ప్రసాదరావు తనిఖీలు నిర్వహించారు. బ్యాగులో డమ్మీ ఆర్డీఎక్స్ బాంబును గుర్తించిన మెరైన్ పోలీసులు వారిని పట్టుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఇద్దరు రెడ్ ఫోర్స్ బృందాన్ని మెరైన్ సీఐ బర్ల ప్రసాదరావు సిబ్బందితో పట్టుకున్నారు.

గంజాయిపై దృష్టి సారించండి: ఎస్పీ

ఇచ్ఛాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):గంజాయి అక్రమ రవాణాపై దృష్టిసారించాలని, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. బుధవారం ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులు, కేసు ఫైల్స్‌ను తనిఖీచేసి కేసులు దర్యాప్తుపై ఆరా తీశారు. పెండింగ్ కేసులు దర్యాప్తును వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, సైబర్ మోసాలపై నమోదైన కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పురుషోత్తపురం చెక్‌పోస్ట్‌ను తనిఖీచేశారు. కార్యక్రమంలో డీఎస్పీ అప్పారావు, సీఐమీసాల చిన్నమనాయుడు, ఎస్ఐలు చిన్నమనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పురుషోత్తపురం చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

ఆర్చరీలో సత్తాచాటిన శ్రీకాకుళం క్రీడాకారుడు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికి చెందిన ఆరంగి కళ్యాణ్ గుజరాత్‌లోని నడయార్ జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి అండర్-14 పోటీల్లో సత్తాచాటాడు. ఈపోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్న జట్టులో కళ్యాణ్ ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. మూడోస్థానం కైవశం చేసుకోవడంతో క్యాంస పతకం లభించింది. కళ్యాణ్ శ్రీకాకుళంలోని ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. కళ్యాణ్‌ను అకాడమీ ప్రతినిధులు అభినందించారు.


క్యాంస పతకంతో కళ్యాణ్

స్మార్ట్‌మీటర్లను బిగించవద్దు


ఎచ్చెర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

లావేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలపై భారాలు మోపే ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్‌మీటర్లు బిగింపు ప్రక్రియ నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ డిమాండ్ చేశారు. బుడుమూరు సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు నాగరాజు, అశోక్, శ్రీనివాసరావు ధర్నా నిర్వహించారు.

●ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ వద్ద సీపీఎంఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగాసీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు నడ్డివిరిచే కార్యక్రమాలకు స్వస్తి పలకకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, హమాలీ యూనియన్ నాయకులు ఎం.సురేష్, కె.గోవిందకుమార్ పాల్గొన్నారు.

అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

కంచిలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనక గ్రామంలో అడవిలో అగ్నిప్రమాదాలు నివారణ చర్యలపై ప్రజలకు ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణనాయుడు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా మందస డీఆర్వో రాము అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో మిగిలిన అడవికాలకుండా ఎలామంటలు ఆర్పాలో వివరించారు. కార్యక్రమంలో హరి బందు, వెంకటేష్, భానుమూర్తి, జోగారావు,దుర్గాదేవి, లక్ష్మణమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

జూడో పోటీలకు బీఆర్‌ఏయూ విద్యార్థినుల ఎంపిక

ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లోగల ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకూ జరగనున్న సౌత్‌వెస్ట్ అంతర్ వర్సిటీ మహిళా జూడో పోటీలకుపాల్గొనే క్రీడాకారిణులను ఎంపికచేశారు.శ్రీకాకుళం ప్రభుత్వడిగ్రీ కళాశాలకు చెందిన సీహెచ్ సాయికుమారి, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన వి.కావ్య పోటీల్లో పాల్గొననున్నారు.ఈ మేరకు క్రీడాకారిణులను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత బుధవారం అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు పిల్లలవలస విద్యార్థి

పొందూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి):పిల్లలవలస జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థి గురుగుబెల్లి సోమశేఖర్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 25నుంచి 29 వరకు చత్తీస్‌గడ్‌లోని మాఘ్కండ్‌లో జరగనున్న 68 జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్‌పోటీల్లో రాష్ట్రం నుంచి అండర్-14 విభాగం పోటీల్లో పాల్గొనను న్నాడు. ఈ మేరకు సోమశేఖర్‌ను సర్పంచ్ బి. పోలినాయుడు, ఉపసర్పంచ్ జి.కృష్ణమూర్తి, హెచ్ఎం కాసులబాబు, పీడీ జి. రాజశేఖరరావు అభినందించారు.

సత్యసాయి దివ్య పల్లకి మహోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని న్యూకాలనీ మందిరం ఆధ్వర్యంలో సత్యసాయిబాబా 99 జయంతి పురస్కరించుకుని సత్యసాయి దివ్యపల్లకి మహోత్సవం బుధవారం నిర్వహించారు.ఈసందర్భంగా సాయిభక్తులు మేళతాళాలతో బాబా విగ్రహాన్ని పల్లకిలో ఉంచి మహిళలు దీపారాధన చేశారు. కాగా సత్యసాయి పెద్ద మందిరంలో నామసంకీర్తన గాయకులు పి.నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి శ్రీసప్తగిరి భక్తి సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు.

భగీరథపురంలో అయ్యప్ప పడిపూజ

ఎచ్చెర్లనవంబరు 20(ఆంధ్రజ్యోతి): భగీరథపురంలో అయ్యప్ప మాలాధరణ చేసిన భక్తులు పడి పూజను బుధవారం నిర్వహించారు. అయ్యప్ప, భవానీ మాలాధరణ చేసిన భక్తులు పురవీధుల్లో అయ్యప్ప ప్రతిమను పల్లకిలో ఊరేగించారు.

●ఆమదాలవలస, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):: అయ్యప్ప స్వాములకు పట్టణ టీడీపీ మైనార్టీ సంఘ అధ్యక్షుడు సయ్యద్ మాలిక్ భిక్ష ఏర్పాటుచేశారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈమేరకు బుధవారం సయ్యద్ మాలిక్ 200మంది స్వాములు అన్న ప్రసాద భిక్ష ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గురుస్వామి విద్యాసాగర్‌తో పాటు నాగళ్ల మురళీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులపై బాధ్యతతో మెలగాలి

గుజరాతీపేట, నవంబరు 20(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులపై శ్రద్ధ చూపించి బాధ్యతతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు కోరారు. బుధవారం శ్రీకాకుళంలోని బొందిలీపురంలో గల ప్రాథమిక పాఠశాలకు పరిశీలించారు.

మామిడిపల్లి కేజీబీవీ పరిశీలన

సోంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి కేజీబీవీని డీఈవో తిరుమల చైతన్య మంగళవారం బుధవారం పరిశీలించారుఈసందర్భంగా విద్యార్థులకు పెడుతున్న మెనూను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వో కాంతమ్మ పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజు

ఇచ్ఛాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఇచ్ఛాపురం మునిసిపాలిటీ యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎం.శంకర్, అధ్యక్షుడిగా కె.సాయికృష్ణ, సహాధ్యక్షుడిగా వి.చంటిబాబు, మహిళా సహాధ్యక్షురాలిగా కె.గగన కుమారి, ప్రధాన కార్యదర్శిగా బి.ప్రకాష్‌రెడ్డి, కోశాధికారిగా కె.సిద్ధాంతి, కార్యదర్శులుగా పి.జోగారావు, డి.దేవరాజు, ఎస్.విజయ, పి.ప్రత్యూష, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సంతోష్‌కుమార్ రౌలో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మాధవరావు, మురళీప్రకాష్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

అరసవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బొందిలీపురంలో మంచినీటి పైపులైన్ పాడవడంతో నగరానికి నీటి సరఫరా బుధవారం నిలిచిపోయింది. దీంతో మునిసిపల్ సిబ్బంది పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.ఈమేరకు నిర్వహిస్తున్న పనులను నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి పరిశీలించారు.కార్యక్రమంలో నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు రెడ్డి.గిరిజా శంకర్, మట్ట మురళీ, సాధు అజయ్ పాల్గొన్నారు.

కవిటి ఎస్ఐగా రవివర్మ

కవిటి, నవంబరు(ఆంధ్రజ్యోతి): కవిటి ఎస్ఐగా రవివర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పురపరిపాలనశాఖ
పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘం
టెండరు నోటీసు

రేఖా సం. 38/2023/E1/BOQ No's 972, 974 (5th Call), 866 (4th Call), 1001, 1003, 1005, 1007, 1012-1013, 1015-1017, 1019 (2nd Call) తే.21/11/2024దీ

పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘంలో 15వ ఆర్థిక సంఘం నిధులు మరియు సాధారణ నిధులతో చేపట్టు పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

పనుల సంఖ్య: 14 అంచనా విలువ రూ.82.29లక్షలు


Bid Document Download End Date & Time	21.11.2024 11.00 AM
Bid Document Download End Date & Time	06.12.2024 03.00 PM
Bid Submission Closing Date & Time	06.12.2024 03.30 PM
Bid Document Open Date & Time	06.12.2024 04.30 PM

మిగతా వివరములకు ఆఫీసు పనివేళలలో తెలుసుకొనవచ్చును మరియు అంతర్జాలములో https://tender.apeprocurement.gov.in

సం/- [illegible] రామారావు, కమీషనర్, పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘం







ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల క్రీడలు



చెస్ ఆడుతున్న విభిన్న ప్రతిభావంతులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ డచ్ భవనం వద్ద ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి విభిన్న ప్రతిభా వంతుల క్రీడాపోటీలను బుధవారం డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 6 నుంచి 15 ఏళ్ల బాల బాలికలు, 15 ఏళ్ల పైబడిన వారికి సహాయకులతో నడక, షాట్‌పుట్, డిస్కస్ త్రో, చెస్, పాటలు, క్యారమ్స్, క్రికెట్, జావెలిన్ త్రో, ట్రైసైకిల్, తదితర పోటీలు నిర్వ హించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డ్వామా పీడీ సుధాకర్, సీపీవో లక్ష్మీ ప్రసన్న, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ బి.శాంతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దొంగతనం కేసులో నిందితులకు రెండేళ్ల జైలు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునసబుపేటకు చెందిన వడ్డి రాజేశ్వరి ఇంట్లో 2021 అక్టోబరు పదో తేదీన జరిగిన దొంగతనం కేసులో నిందితులకు జైలు శిక్ష విధించినట్లు రూరల్ ఎస్‌ఐ కె.రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో ఇచ్ఛాపురం మండలంలోని తేలుకుంచికి చెందిన కొయ్య పాపారావు, మద్ది పరుశురాం లను 2021 అక్టోబరు 29న అరెస్టు చేసి రూరల్ పోలీసులు కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులకు శ్రీకాకుళంలోని ఒకటో అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అపరాధ రుసుం చెల్లించని పక్షంలో అదనంగా నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ రాము పేర్కొన్నారు.

తల్లి, చెల్లిపై దాడి

వజ్రపుకొత్తూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భూముల విషయమై సోదరి, సోదరుల మధ్య కొన్ని రోజులుగా తగాదాలు జరుగుతున్న నేపథ్యంలో కుమారుడు దానేసు తల్లి దూగాన లక్ష్మమ్మ, చెల్లి రెల్ల హేమలతపై దాడి చేసి గాయపరిచిన ఘటన బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వరి పంట కోతకు సిద్ధమవగా పంట విషయమై మరోమారు పొలంలోనే చెల్లి అన్నదమ్ముడి మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో జరిగిన వివాదంలో కర్రతో తల్లి, చెల్లిపై దాడి చేసినట్లు సమాచారం. వెంటనే క్షతగాత్రులను స్థానికులు పలాస ప్రభుత్వాసు పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఎస్‌ఐ నీహార్‌ను ప్రశ్నించగా ఫిర్యాదు వచ్చిందని, వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై విచారణ

- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఇరువర్గాలకు సర్దిచెబుతున్న పోలీసులు

జలుమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.రమణ అక్రమాలకు పాల్పడ్డారంటూ గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు బుధవారం స్థానిక గ్రామ సచివాల యంలో ఉపాధి ఏపీడీ కె.లోకేష్ గ్రామసభ నిర్వహించి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య తోపులాట ఏర్పడింది. వివరాలిలా ఉన్నాయి.. ఉపాధి పనులకు వెళ్లకుండా అనేక మందికి ఫీల్డ్ అసిస్టెంట్ రమణ వేతనాలు చెల్లించారని పలువురు గ్రామ స్థులు ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏడీపీ లోకేష్ గ్రామసభ నిర్వహించి గ్రామస్థులతో విచారించారు. అయితే ఈ విషయంలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటా మాటా పెరిగి తోపులాటకు దారితీసంది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో వివాదం సద్దు మణిగింది. దీనిపై ఏపీడీ లోకేష్ మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జలుమూరు ఫీల్డ్ అసిస్టెంట్ రమణ అక్రమాలపై దర్యాప్తు నిర్వహించి నివేదికను జిల్లా అధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శేఖర్, సర్పంచ్ ఇప్పిలి దుర్గమ్మ, ఎంపీటీసీ డోల నాగరత్నం, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు మునుకోటి దామోదరరావు, వేతనదారులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు కృషి చేయండి




మాట్లాడుతున్న కొర్రాయి బాలకృష్ణ యాదవ్

వజ్రపుకొత్తూరు,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వాల నమోదుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం వజ్రపుకొత్తూరులో పార్టీ మండల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభు త్వం ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభి వృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతి ఒక్క ముఖ్య నాయకుడు వంద సభ్యత్వాలు చేయాలన్నారు. మండల కమిటీలను ఎన్నుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు తమ్మినేని విఘ్నేశ్వరరావు, కొరికాన గోపి, గుంటి చంద్రశేఖర్, మద్దు నరేష్, కొవిరి మాధవరావు, ఎంపల్లి మాధవరావు, మురుపల్లి జేజేరావు పాల్గొన్నారు,

డిసెంబరు 18 నుంచి పల్లె శ్రీమేళా

- కలెక్టర్ విజయ్‌కుమార్ దాస్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌కుమార్ దాస్

ఒడిశా

పర్లాకిమిడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లె శ్రీ మేళా డిసెంబరు 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ్‌కుమార్ దాస్ అన్నారు. దీనికి సంబంధించి సన్నాహక సమావేశం బుధ వారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె శ్రీమేళా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మేళాలో జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు తయా రు చేసిన ఆహార ఉత్పత్తులు, ఇతర ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం చేపడతా మన్నారు. పలు రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఈ మేళాలో పాల్గొని తమ ఉత్ప త్తుల విక్రయాలు చేపడతారన్నారు. అలాగే అటవీశాఖ, మత్స్యశాఖ, ఓర్మాస్, గిరిజ నాభివృద్ధి సంస్థ, వ్యవసా యశాఖ, బాలల సంరక్షణ, జిల్లా పారిశ్రా మిక కేంద్రం వంటి వివిధ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి నిమిత్తం 200 స్టాల్స్ ఏర్పాట్లు చేస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో గుణనిధి నాయక్, డిప్యూటీ కలెక్టర్ అమేష్‌పండా, పృథ్వీరాజ్ మండల్, మిషన్ శక్తి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ తిమాన్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

కాశీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటన



ఆహార పదార్థాలను రుచి చూస్తున్న ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి

పర్లాకిమిడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గజపతి జిల్లా కాశీనగర్ సమితి అల్లాడ గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి బుధవారం పర్యటించారు. ఆ గ్రామ సమీపంలోని చెక్‌డ్యాంలను సందర్శించారు. అనంతరం అల్లాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పదార్థాలను రుచిచూశారు. కార్య క్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి, సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సకు 48 మంది ఎంపిక

మందస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 96 మందికి పరీక్షలు నిర్వహించి 48 మందికి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంటి వైద్యసహాయకులు ఎ.కావ్య, క్యాంపు ఇన్‌చార్జి రామారావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు బైరాగి, వడ్డి అప్పారావు, పూన ఈశ్వరరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టెక్కలి 11కేవీ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. టెంబూరు రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, సబ్ కలెక్టర్ కార్యాలయం, గ్యాస్ గొడౌన్, ఎన్టీఆర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, పాత ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

బోనెలకు డైరెక్టర్‌గా నియామకంపై హర్షం

నందిగాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బోనెల అప్పారావుకు మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై ఆ సంఘం జిల్లా కార్యదర్శి తుంగాన తిరుపతిరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర పరిధిలో జిల్లాకు మాల కార్పొరేషన్‌లో సముచిత స్థానం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనికి సహకరించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో బి.ప్రభాకరరావు, వనజ నాభం, డి.ధనుం జయరావు తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

పోలాకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి దుర్గాగిరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం షిర్డీసాయి, సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. విగ్రహ దాతలు చిట్టి ఎర్రన్న, మెండ నాగేశ్వరరావు దంపతులతో పండితులు ప్రత్యేక పూజలు చేయించారు. విగ్రహాలకు గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పల్లి సూరిబాబు, మెండ కృష్ణ సమంగళి, పాగోటి తాతబాబు, ఆలయ కమిటీ సభ్యులు పల్లిరాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతి సర్వే వేగవంతం చేయాలి

కోటబొమ్మాళి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉన్నతి సర్వేని వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్ర సహాయ కులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లో విద్యావంతులైన వారికి స్వయం ఉపాధి కల్పనకు ఈ సర్వే నిర్వహించడం జరుగుతోందని, దీనిని బాధ్యతగా నిర్వహించి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 80 నుంచి 99 రోజులు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు చేరుకునేలా పనులు కల్పించాలన్నారు. రైతులకు మంజూరైన గోశాలను నిర్మాణాలు పూర్తయ్యేలా, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జి.హరిప్రసాద్, ఈసీ టి.రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

26న కేంద్ర ప్రభుత్వ విధానాలపై 'శంఖారావం'

కాశీబుగ్గ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద 'శంఖారావం' నిర్వహిస్తున్నామని ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధ వారం సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు గిట్టుబాటు ధరకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని, స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ర్యాలీ, ధర్నాలో కార్మికులు, రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గణపతి, సీహెచ్ వేణుగోపాల్, మాధవరావు, బాలాజీ రావు, వీరాస్వామి,సీతమ్మ పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు

సంతబొమ్మాళి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే నవ సమాజ నిర్మాత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడని స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ పి.రామకృష్ణ అన్నారు. బోరుభద్ర జడ్పీ హైస్కూల్‌లో బుధ వారం సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల సముదాయ సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో సాంఘికశాస్త్ర ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, కె.భానుమూర్తి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి

జలుమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాథస్వామి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యా లయ సమావేశ మందిరంలో బుధవారం సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు ధాన్యం సిద్ధం చేసినట్లు సమాచారం వచ్చిన వెంటనే గ్రామ సచివాలయం సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఆపరేటర్ కళ్లానికి వెళ్లి తేమ, పొల్లు, చెడిపోయిన ధాన్యం శాతాన్ని గుర్తించాలన్నారు. 17 శాతం కంటే తేమ ఎక్కువగా ఉంటే కళ్లంలో ధాన్యాన్ని ఆరబెట్టించి తేమ శాతం తగ్గిన తరువాత కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనల మేరకే ధాన్యం కొనుగోలు చేయాలని సూచించార కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం. కె.శ్రీనివాసులు, డీడీఏ భవానీ శంకర్, ఏడీఏ బగ్గు రజని, సివిల్ సప్లై డీటీ జాఫర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి సహకరించండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజాచక్రవర్తి

టెక్కలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ డిసెంబరు 14న నిర్వహించ నున్నందున దీనిని సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి అన్నారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో టెక్కలి, మెళియాపుట్టి, నందిగాం పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను రాజీమార్గంలో పరిష్కరించేందుకు కక్షిదారులకు అవగాహన కలి గించాలన్నారు. రాజీపడదగిన అన్నిరకాల కేసులు ఇదే అవకాశమన్నారు. సమావేశంలో వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఆర్డీవో చర్చ



మ్యాప్‌ను పరిశీలించి ఏఏఐ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో గ్రంథి వెంకటేష్

పలాసరూరల్,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి బుధవారం ఆర్డీవో గ్రంథి వెంకటేష్ విశాఖపట్నంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులను కలిసి చర్చించారు. వజ్రపుకొత్తూరు-మందస మండలాల మధ్య సుమారు 1,383 ఎకరాల స్థల సేకరణ, రవాణా, నియోజకవర్గ ప్రధానరోడ్లు, జిల్లా నుంచి వెళ్లే మార్గాలు, ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులతో చర్చించారు. మ్యాప్‌ను పరిశీలించారు. అధికారులతో ఎయిర్‌పోర్టు గురించి స్టడీ చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రధాన కార్యక్రమాలపై మాట్లాడారు. సమావేశంలో డీటీ ప్రసాద్, సర్వేయర్ చంద్ర శేఖర్, ఏఏఐ అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



నరసన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజవర్గ అభివృద్ధికి మరింత సహకరిం చాలని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం సీఎం చంద్రబాబునాయుడును కలిసి వినతిపత్రం అందించి సమస్యలను విన్నవించారు. బొంతు ఎత్తిపోతల పథకం, వంశధార కాలువలు ఆధునికీకరణ, కరకట్టల సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, నరసన్నపేట పట్టణంలోని పలు సమస్యలను వివరిం చారు. పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వీటి పై సీఎం సానుకూలంగా స్పందించారని రమణమూర్తి తెలిపారు.

శ్రీకూర్మం అభివృద్ధికి చర్యలు తీసుకోండి

గార, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు.ఈ మేరకు ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి మైగాపు ప్రభాకరరావు, గోర సురేష్, వీఎస్ గిరి అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందజేశారు. శ్రీకూర్మంలో దళ్లాం చెరువును మినీ రిజర్వాయరుగా అభివృద్ధి చేయాలని, సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుచేయాలని, పర్యాటకంగా శ్రీకూర్మం క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

టీడీపీ సభ్యత్వంతో ఉజ్వల భవిష్యత్: ఎంపీ



పార్టీ సభ్యత్వం అందిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

లావేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో సభ్యత్వం తీసుకున్న వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. బుధవారం లావేరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్య క్రమం నిర్వహించారు. టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజలు ఉత్సా హం చూపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండ లాధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ తోటయ్య దొర, లంకలపల్లి శ్రీనివాసరావు, నారాయణరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక పూజలు



సాయిమందిరంలో పూజలు చేస్తున్న మహిళలు

పోలాకినవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక మందిరంలో సామూహిక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలు ఈనెల 23 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బరాటం రామారావు తెలిపారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి



కవిటి/కంచిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని ఒడియా విద్యార్థుల సమస్యలను పరి ష్కరించాలని ఒడి యా టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర పాడి, ప్రధాన కార్యదర్శి బృందా వన్ దొళాయి కోరారు. ఈ మేరకు అమరావతిలో బుధవారం ఎమ్మెల్యే బి.అశోక్‌తో కలిసి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందించారు. ఒడియా డీఐ పోస్టును భర్తీ చేసి పాఠశా లల్లో విద్యార్థుల సంఖ్య మేరకు టీచర్లు నియమించాలని కోరా రు. కంచిలి మండలంలోని సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామా రావు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

రణస్థలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జేఆర్‌పురం ఎస్‌ఐ చిరంజీవి సూచించారు. బుధవారం కోష్ఠ జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాతర్లపల్లిలో మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించారు.

అసమానతలు లేని సమాజానికి బాలలే ప్రతినిధులు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజానికి బాలలే నిజమైన ప్రతినిధులని జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి బి.శాంతిశ్రీ తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని మహిళా కళాశాల నుంచి సూర్యమహల్ కూడలి వరకు బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బాల బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యమహల్ కూడలి వద్ద మానవ హారాన్ని ఏర్పాటుచేశారు. డీఎస్పీ వివేకానంద, డీబీసీఆర్వో కె.చెన్నకేశవరావు, ఐసీపీఎస్ రమణ పాల్గొన్నారు.

బాల్య వివాహాల వల్ల నష్టాలు

ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల నష్టాలు, దత్తత ప్రక్రియపై ఐసీడీఎస్ సీడీపీవో డి.పాపి నాయుడు అవగాహన కల్పించారు. ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో బాలల హక్కుల వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఐసీడీఎస్, జిల్లా బాలల రక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైద్యులు సమయపాలన పాటించాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సమయపాలన పాటించాలని సూపరింటెండెంట్ డా. శ్రీనివాసబాబు సూచించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఒక్క పూటే వైద్యం.. అరకొర సేవల'పై వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. వైద్యులతో అత్యవసర సమావేశం నిర్వహించి చర్చించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలో తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా అత్యవసర కేసులను మాత్రమే రిఫర్ చేస్తున్నామని, మధ్యాహ్నం ఓపీ తక్కువగా ఉండడంతో వైద్యులు వేరొక గదుల్లో ఉన్నారని, డబ్బులు తీసుకుంటున్నట్లు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని, వైద్యులు కొందరు డేఆఫ్, కొందరు డిప్యూటేషన్ వల్ల గర్భిణుల ఓపీ కొంచెం ఆలస్యం అయిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికలు

టెక్కలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు డొంకాన రామకృష్ణ, కార్యదర్శి పొన్నాడ పార్వతీశం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-12 బాలురు, బాలికల విభాగాల్లో జరుగు పోటీలకు 2012 నుంచి 2014 మధ్యలో జన్మించిన వారై ఉండాలని, వారి ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికేట్‌లతో హాజరుకావాలన్నారు. ఎంపికైన రగ్బీ క్రీడాకారులు డిసెంబరు 1, 2 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు బాడాన నారాయణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి 85000 07272 నెంబరులో సంప్రదించాలని కోరారు.

అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయండి

పలాస, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడు గ్రామ జంక్షన్‌లో గురువారం నిర్వహించ నున్న శ్రీకాకుళ అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు కోరారు. ఈ మేరకు బుధ వారం సూదికొండ కాలనీ కార్యాల యంలో విలేకరులతో మాట్లాడుతూ.. 1967లో ప్రారంభమైన నక్సల్‌బరీ ఉద్యమం నాలుగేళ్ల పోరాటకాలంలో 360 మంది వరకు అమరుల య్యారని, వీరిని స్మరిస్తూ.. అమరుల స్థూపం వద్ద సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దున్నే వాడికి భూమి దక్కేంత వరకు, కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

మత్తుతో జీవితాలు ఛిద్రం

పాతపట్నం నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితాలు ఛిద్రమవుతాయని, వీటిని యువత దూరంగా ఉండాలని సీఐ వి.రామారావు అన్నారు. స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో 'సంకల్ప్' కార్యక్రమాన్ని బుధ వారం నిర్వహించారు. విద్యార్థులు తెలిసీ తెలియని వయసులో మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతున్నారని, దీంతో విద్యకు దూరమై తల్లిదండ్రుల ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. అందువల్ల వీటికి దూరంగా ఉండడంతో పాటు వీటి నియంత్రణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఆంధ్రా-ఒడి శా సరిహద్దు చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

సమ్మె తాత్కాలిక విరమణ

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న శానిటరీ మేస్త్రీలను నోటీసులివ్వకుండా తొలగించడంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎనిమిది రోజులుగా మునిసిపల్ కార్మికులు చేపడుతున్న సమ్మెను తాత్కాలికంగా విరమించారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికుల బుధ వారం నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా నిలిపి వేశారు. కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు, శానిటరీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, సతీష్, కిషోర్, రామారావు, శ్రీను పాల్గొన్నారు.

కొత్తూరు ఎస్‌ఐ బదిలీ

కొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎంఏ అహ్మద్‌కు బుధవారం ఇంటిలిజెన్స్ విభాగానికి డెప్యుటేషన్‌పై బదిలీ జరిగింది. ఈ సందర్భంగా సీఐ చింతాడ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన గాత్ర సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కచ్చపి కళా క్షేత్రం ఆధ్వర్యంలో బాపూజీ కళామందిరంలో బుధ వారం గాత్ర సంగీత విభావరి నిర్వహించారు. మల్లాది శ్రీరామ్ ప్రసాద్, రవికుమార్ భక్తి గీతాలను ఆలపించారు. వైలన్‌పై ఎస్.కన్నన్, మృదంగంపై వంకాయల వెంకటరమణ మూర్తి సహకరించారు. కార్యక్రమంలో మార్పూరి హరిబాబు, బంకుపల్లి దుర్గా శ్రీనివాస్ శర్మ, శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.